



పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న చొక్కాకుల

సబ్బవరం: అంతకాపల్లి శివారు ఒమ్మివానిపాలెంలో మదర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు శనివారం దుప్పట్ల పంపిణీ జరిగింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు ముఖ్య అతిథిగా పాల్గొని, సుమారు 200 మందికి దుప్పట్లు అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు సత్యగంగరాజు సేవలను కొనియాడారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గ్రామ పెద్ద కోన గంగయ్య చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. అనంతరం ట్రస్ట్ గౌరవాధ్యక్షునిగా చొక్కాకుల వెంకటరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పద్మావతి, ట్రస్టు సభ్యులు శ్రీనివాసరావు, తారకేశ్వరి, పి.చైతన్య, పల్ల రమణ పాల్గొన్నారు.

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడిగా మోటూరి


నియామక పత్రం అందుకొంటున్న సన్యాసినాయుడు

పరవాడ: రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడిగా రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు ఎన్నికయ్యారు. ఇటీవల విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో సర్పంచుల సంఘం ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా సన్యాసినాయుడుకు సంఘం గౌరవ అధ్యక్షుడు వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ నియామక ఉత్తర్వులను అందజేశారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ ఉపాధ్యక్షుడు సీహెచ్. ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అనాథబాలలతో ఆటపాట

పెదగంట్యాడ: అనాథ బాలల్లో ఆనందోత్సాహాన్ని నింపారు హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్. స్ఫూర్తి అనాథాశ్రమం నుంచి సుమారు 70మంది చిన్నారులను శనివారం నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు తీసుకువచ్చారు. వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

నూతన నియామకం


బొట్ట ముత్యాలరావు

సబ్బవరం: వైఎస్సార్ సీపీ 88వ వార్డు యువజన విభాగం అధ్యక్షునిగా బొట్ట ముత్యాలరావు నియమితులయ్యారు. పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన నియామక ఉత్తర్వులను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు, వార్డు అధ్యక్షుడు గంగ్రెడ్డి మహాలక్ష్మి నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.











ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు, సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై పగల్‌పత్తు ఉత్సవాలను తొమ్మిదో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో ధనుర్మాస పూజలు చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజ గోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ పూజలను నిర్వహించారు. పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో, సింహాచలం దేవస్థానానికి చెందిన వెంకన్న ఆలయంలో ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహించారు. తిరుప్పావై సేవాకాలాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

2 నుంచి సిటూ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిటూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఈ సభల్లో చర్చిస్తామన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించడం, ప్రమాదాలను అరికట్టడానికి చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడతామన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు గేదెల అప్పారావు, పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెంలో బీటీ రోడ్డు నిర్మాణానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. భవానీనగర్ నుంచి లక్ష్మీపురం వసంత గార్డెన్స్ వరకు రూ.99.23లక్షలతో ఈ రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తెలిపారు. అనంతరం వారు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, వార్డు నాయకులు పేరూరి చినబాబు, ప్రకాశం, రోమాల నూకరాజు, బొద్దు నారాయణమూర్తి, కాళ్ల గంగాధర్, జోబ్‌దాస్, చిప్పల చందు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలో 'మేలుకొలుపు' సందడి



పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధార్మిక జట్టు సహకారంతో నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో ధనుర్మాస ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. నెలగంట మొదలుకొని భోగి పండుగ వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలో సుమారు 30 గ్రామాల్లో ధనుర్మాస మేలు కొలుపు ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ రెండు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మాతృమూర్తులు సంతోషి, లక్ష్మి, కె. అప్పలనాయుడు, రాజు, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. మూడు లక్షల విరాళాలు

సింహాచలం: అప్పన్న శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ఎన్‌ఏడీ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన కె.సంతోష్ లక్ష రూపాయలను చెక్కు రూపంలో సింహగిరిపై మే ఐ హెల్ప్‌యూ కేంద్రంలో ఏఈవో ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. కె.సత్యదేవ్ అనే దాత లక్ష 116 రూపాయల విరాళాన్ని నగదు రూపంలో ఏఈవో శ్రీనివాసరావుకు అందించారు. ఒడిశాలోని బరంపురానికి చెందిన బి.జగ్గారెడ్డి లక్ష 1,116 రూపాయల విరాళాన్ని అన్నదాన విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావుకు అందజేశారు. దేవస్థానం పీఆర్వోలు సునీల్, నాయుడు పాల్గొన్నారు.



























